నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
11 | హైదరాబాద్, గురువారం 29 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- జిల్లాలో 32 సెంటర్లు ఏర్పాటు
- తొలి రోజు 395 మంది విద్యార్థుల గైర్హాజరు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. తొలి రోజు నిర్వహించిన తెలుగు, ఉర్దూ, సంస్కృతం పరీక్షలకు 6,775 మంది విద్యార్థులకు గానూ 6,180 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9 గంటల ఉంచి మధ్యాహ్నం 12 గంటలకు పరీక్షలు కొనసాగాయి. మొదటి రోజు 395 మంది గైర్హాజరైనట్లు నోడల్ ఆఫీసర్ సి.రమణి తెలిపారు.

యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద హాల్ టిక్కెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయం

- కాంగ్రెస్‌కు చైర్మన్.. బీజేపీకి వైస్ చైర్మన్ పదవి
- 17 మంది కౌన్సిలర్లు ఉన్నా వైస్ చైర్మన్ పదవికి పోటీ చేయని కాంగ్రెస్
- ఎన్నికలపై కౌన్సిలర్ల అసంతృప్తి.. ఒకరి రాజీనామా

భువనగిరిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల పంపకం

యాదాద్రి భువనగిరి, (నమస్తే తెలంగాణ) / భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 28 : జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయానికి తెరలేపాయి. బయటకు రోజంతా ఒకదానిపై మరికొకటి దుమ్మెత్తి పోసుకునే ఆ రెండు పార్టీలు పదవుల దగ్గరికి వచ్చేసరికి ములాఖత్ అయ్యాయి. భువనగిరి మున్సిపాలిటీలో ఒకరికొకరు పరస్పరం సహకరించుకుని పదవులను పంచుకున్నాయి. ఎలాగైనా బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలని కుట్రలకు పాల్పడ్డాయి. భువనగిరి మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్, వైస్ చైర్మన్ బీజేపీ సభ్యులు చేజిక్కించుకున్నారు. గత నెలలో బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి పడగొట్టిన విషయం తెలిసిందే. బుధవారం భువనగిరి మున్సిపల్ ఆఫీసులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.జయశ్రీ సమక్షంలో చైర్మన్, వైస్ చైర్మన్ కోసం ఎన్నిక నిర్వహించారు. మొత్తం 35 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్‌అఫీషియో మెంబర్‌తో కలిపి 36 మంది కాగా, కౌన్సిల్ హాల్‌కు 30మంది సభ్యులు హాజరయ్యారు. చైర్మన్‌కు కాంగ్రెస్ నుంచి 29వ వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పోటీలో నిలువగా 18 మంది అనుకూలంగా చేతులెత్తారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ముగ్గురు బీజేపీ కౌన్సిలర్లు చేతులెత్తడం గమనార్హం. చైర్మన్‌కు బీజేపీ సహకరించడంతో వైస్ చైర్మన్‌కు కాంగ్రెస్ మద్దతుగా నిలిచింది. వైస్ చైర్మన్‌కు బీజేపీకి చెందిన 25వ వార్డు కౌన్సిలర్ మాయ దశరథ ఒక్కరే పోటీలో ఉండడగా ఆయననే వైస్ చైర్మన్‌గా ప్రకటించారు.

మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.జయశ్రీ, చిత్రంలో చైర్మన్‌గా ఎన్నికైన పోతంశెట్టి

కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం

భువనగిరి మున్సిపాలిటీలో 35 మంది వార్డు కౌన్సిలర్లు, ఒకరు ఎక్స్ అఫీషియో సభ్యుడితో కలిపి మొత్తం 36 మంది ఉన్నారు. ఇందులో టీఆర్ఎస్ 20, కాంగ్రెస్ 9, బీజేపీ కౌన్సిలర్లు ఆరుగురు. గతంలో బీఆర్ఎస్ పార్టీ చైర్మన్‌గా ఉన్న ఎన్నబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యపై బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మొత్తం 31 మంది అవిశ్వాసం పెట్టాలని కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. గత నెలలో పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఖాళీ అయ్యాయి. ప్రభుత్వ ఆదేశం మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికకు 29 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించగా బీజేపీ నుంచి 9వ వార్డు కౌన్సిలర్ నల్లమాస సుమ 22వ వార్డు కౌన్సిలర్ బొర్ర రాకేష్ పేరును చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా, 21వ వార్డు కౌన్సిలర్ ఉదయగిరి విజయ్‌కుమార్ బలపరిచాడు. కాంగ్రెస్ పార్టీ నుంచి 11వ వార్డు కౌన్సిలర్ జిట్ట వేణుగోపాల్‌రెడ్డి 29వ వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి వెంకటేశ్వర్లును చైర్మన్‌గా ప్రతిపాదించగా, 28వ వార్డు కౌన్సిలర్ కైరంకొండ వెంకటేశ్వర్లు బలపరిచాడు. చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ఇద్దరు పోటీలో ఉండడంతో చేతులెత్తి ఓటు వేసే ప్రక్రియను నిర్వహించారు. అలా బొర్ర రాకేష్‌కు ఐదుగురు బీజేపీ కౌన్సిలర్లు చేతులెత్తగా, పోతంశెట్టి వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ నుంచి 11, బీఆర్ఎస్ 3, బీజేపీ 3, ఎమ్మెల్యే కుంభంతో కలిపి 18 మంది ఓటు వేశారు. దాంతో పోతంశెట్టి వెంటేశ్వర్లు మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా బీజేపీ పార్టీ 25వ వార్డు కౌన్సిలర్ మాయ దశరథను 24 వ వార్డు కౌన్సిలర్ రత్నపురం బలరామ్ ప్రతిపాదించగా, 13వ వార్డు కౌన్సిలర్ జనగాం కవిత బలపరిచారు. వైస్ చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు 17 మంది ఉన్నా వైస్ చైర్మన్ పదవికి పోటీలో లేకపోవడంతో బీజేపీ, కాంగ్రెస్ లోపాయికారీతనం బట్టబయలైంది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశం నుంచి బయటికి వెళ్లిపోవడంతో దశరథ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చైర్మన్ ఎన్నికపై అసంతృప్తి.. 20వ వార్డు కౌన్సిలర్ రాజీనామా

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులపై ఆశాభావంతో ఉన్న కౌన్సిలర్లు ఈ ఎన్నికపై అసంతృప్తిగా ఉన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ పచ్చల హేమలతాజగన్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కొండల్‌రావుకు తమ రాజీనామా పత్రాన్ని అందజేశారు. మున్సిపల్ చైర్మన్ అవిశ్వాసం జరిగిన నాటి నుంచి ఎన్నిక జరిగే రోజు వరకు తమ పేరును మున్సిపల్ చైర్మన్‌గా ప్రతిపాదించారని, తీరా ఎన్నిక నిర్వహించే సమయంలో మరొక కౌన్సిలర్ పేరు రావడంతో నివ్వెరపోయినట్టు చెప్పారు. ఎమ్మెల్యే మాటకు కట్టుబడి చేతులెత్తినట్టు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే ఆదేశాల మేరకే ఇలా జరిగిందని, వారిపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ మరికొందరు కౌన్సిలర్లు పదవికి, పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తున్నది. కాగా, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీజేపీ సహకరించిందని, అందుకు ప్రతిఫలంగానే కమలం పార్టీకి వైస్ చైర్మన్ పదవిని కట్టబెట్టారని బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది.

యాదగిరీశుడికి వైభవంగా దర్బార్ సేవ

దర్బార్ సేవలో భాగంగా స్వామివారికి నక్షత్ర హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి బుధవారం సాయంత్రం దర్బార్ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించి ప్రధానాలయం ముఖ మండపంలో వేంచేపు చేసి నాలుగు వేదాలు పారాయణం చేసి స్వామి వారి స్వస్తిమంత్రార్థ వంటి మంత్రాలతో శాంతింపజేశారు. స్వామివారికి నక్షత్ర హారతిని ఇచ్చి మంత్రపుష్ప నీరాజనం చేశారు. సుమారు అరగంటపాటు సాగిన సేవలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామివారికి సహస్రనామార్చన చేసి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన జరిపించారు. సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా చేపట్టారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవ నిర్వహించారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణ తంతును చేపట్టారు. లక్ష్మీ సమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ గంటన్నరకుపైగా నిత్యతిరు కల్యాణ తంతును జరిపారు. స్వామి వారి కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ చేపట్టారు. రాత్రి తిరువారాధన చేపట్టి, స్వామివారికి తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామివారికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. సంకష్టహర చతుర్థి సందర్భంగా శ్రీపర్వత వర్ధనీసమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 6 వేల మంది భక్తులు లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.13,48,787 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీఈఓ నారాయణరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : రాబోయే పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని స్థాయిలలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ కె.నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, విద్యాశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నందున పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం వంటి అన్ని వసతులు కల్పించాలని సూచించారు. పరీక్షల నిర్వహణపై ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, బయటి వ్యక్తులను అనుమతించవద్దని స్పష్టం చేశారు. దివ్యాంగులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యుత్ కనెక్షన్ కోసం సబ్‌స్టేషన్ ఎదుట రైతు ధర్నా

సంస్థాన్‌నారాయణపురం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

సంస్థాన్‌నారాయణపురం, ఫిబ్రవరి 28 : వ్యవసాయ బావి వద్ద మోటర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ మండలంలోని పుట్టపాక గ్రామానికి చెందిన సుక్క మారయ్య అనే రైతు తోటి రైతులతో కలిసి బుధవారం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగాడు. ఈ సందర్భంగా రైతు మారయ్య మాట్లాడుతూ బావి వద్ద విద్యుత్ కనెక్షన్‌కు నాలుగు స్తంభాలు అవసరం అవుతున్నాయని ఏఈని కోరితే.. రూ.54 వేలు డీడీ కట్టాలని ఎస్టిమేషన్ వేశారని చెప్పాడు. రూ.54 వేలు కడితేనే కనెక్షన్ ఇస్తాం, లేదంటే రాదని చెప్పినట్లు వాపోయాడు. తనకున్నది రెండెకరాల భూమి అని, అంత డబ్బు సర్దలేనని ఆవేదన చెందాడు. రూ.7 వేలు డీడీ కడితే ఎవరికైనా మూడు స్తంభాలు ఇస్తున్నారని, ఒక్క స్తంభం ఎక్కువ ఇవ్వాలని అడిగినందుకు రూ.54 వేలు డీడీ అడుగుతున్నారని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయాడు. తప్పుడు ఎస్టిమేషన్ వేసి రైతులను ఇబ్బందుల పాల్జేస్తున్నారని, విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుంటే సబ్‌స్టేషన్ వద్దే ఆత్మహత్య చేసుకుంటానని మారయ్య ధర్నాకు దిగాడు. ఈ విషయమై విద్యుత్ ఏఈ దివ్యను వివరణ కోరగా.. 'మారయ్య విద్యుత్ కనెక్షన్ కోసం సంప్రదించిన మాట వాస్తవమే. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే 4 స్తంభాలకు రూ.54వేలు ఎస్టిమేట్ వేశాం. సబ్సిడీ కింద రూ.45 వేలు తిరిగి రైతు ఖాతాలో జమ చేస్తాం' అని తెలిపారు

కష్టజీవులపైకి మృత్యుశకటం

కూలీల ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఐదుగురు దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం
- మూడు గ్రామాల్లో విషాదఛాయలు

జీవన ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లను చూసినా వాళ్లు బతుకు పోరాటంలో మాత్రం ఎన్నడూ అలిసిపోలేదు. కలో గంజో తాగి రెక్కల కష్టం మీద కుటుంబాలను నెట్టుకుంటూ వచ్చారు. పిల్లలను చదివించుకున్నారు.. పెండ్లిండ్లు చేసి బాధ్యత తీర్చుకున్నారు. ఇప్పుడు ఏడు పదుల వయస్సులోనూ ఇతరులపై ఆధారపడకుండా శ్రమనే నమ్ముకుని బతుకుతున్న వారిపైకి ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం నుంచి మోతె మండలానికి మిర్చి కూళ్లకు వెళ్తున్న కూలీల ఆటోను బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు కూలీలు దుర్మరణం చెందారు.

– మునగాల, ఫిబ్రవరి 28

నారాయణమ్మ (ఫైల్)

నాగమ్మ (ఫైల్)

సౌభాగ్యమ్మ (ఫైల్)

అనసూర్య (ఫైల్)

గురువయ్య (ఫైల్)

మునగాల మండలం విజయరాఘవాపురం గ్రామానికి చెందిన రెమిడాల సౌభాగ్యమ్మ (75), కందుల గురువయ్య (70), రామసముద్రం గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ (56), కందుల నాగమ్మ (65), రేపాల గ్రామానికి చెందిన పోకల అనసూయమ్మ (65) మోతె మండలంలోని పలు గ్రామాల్లో మిరపకాయలు ఏరేందుకు కొన్ని రోజుల నుంచి ఆటోలో వెళ్లి వస్తున్నారు. రోజు మాదిరిగా బుధవారం ఆటోలో వెళ్తుండగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట మోతె మండలంలోని కేశవాపురం అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ఖమ్మం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న మధిర డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణమ్మ, నాగమ్మ, సౌభాగ్యమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో అనసూర్య కూడా మరణించింది. గురువయ్య పరిస్థితి తీవ్ర విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, ఆయన అక్కడ మృతిచెందాడు. మరో కూలీ లక్ష్మి పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాద సమయంలో ఆటోలో 12మంది కూలీలు ఉండగా.. ఆరుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ విజయరాఘవాపురం గ్రామానికి వెళ్లి బాధితుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుకున్నారు.

ఒంటరి మహిళ నువదలని మృత్యువు

విజయరాఘవాపురం గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ కడు బీదరాలు. ఆమెకు పిల్లలు లేరు. భర్త మరణించగా ఒంటరిగా జీవిస్తున్నది. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బుతో జీవిస్తుంది. ఖర్చుల కోసం కూలి నాలి పనులకు వెళ్తుంది. రోడ్డు ప్రమాదంలో విగతజీవిగా మారడంతో గ్రామస్తులు కంటతడి పెట్టారు.

జీవన పోరాటంలో నిలిచి.. ప్రమాదంలో ప్రాణం విడిచింది

విజయరాఘవాపురం గ్రామానికి చెందిన రెమిడాల సౌభాగ్యమ్మ (75) ముగ్గురు కూతుర్లకు పెళ్లిళ్లు చేసి జీవన పోరాటంలో నిలిచింది. చరమాంకంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఆమె రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచింది.

ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన కూలీల ఆటో

మరణంలోనూ వీడని దాంపత్యం

రోడ్డు ప్రమాదంలో విజయరాఘవాపురం గ్రామానికి చెందిన కందుల నాగమ్మ (65), గురువయ్య(70) దంపతులు మృతిచెందగా.. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నాగమ్మ సంఘటనా స్థలంలో మృతిచెందగా.. గురువయ్య హైదరాబాద్ దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడు.

ఉత్తమ్ రారు.. స్కూటీలు ఇవ్వరు!

కలెక్టరేట్‌లో మూలుగుతున్న మూడు చక్రాల స్కూటీలు

- దివ్యాంగులకు మంజూరు చేసిన కేసీఆర్ ప్రభుత్వం
- ఎన్నికల కోడ్‌తో ఆగిన పంపిణీ
- రెండు నెలలుగా మంత్రి టైమ్ కోసం ఎదురుచూపులు

కలెక్టరేట్‌లో పడిఉన్న మూడు చక్రాల స్కూటీలు

సూర్యాపేట, ఫిబ్రవరి 28 : మంత్రి ఉత్తమ్ సారూ.. కొంచెం టైమ్ ఇచ్చి మూడు చక్రాల స్కూటీలు పంపిణీ చేయరాదూ.. అని దివ్యాంగులు కోరుతున్నారు. దివ్యాంగుల కోసం కేసీఆర్ ప్రభుత్వం చేసిన మూడు చక్రాల స్కూటీలు కలెక్టరేట్ కారిడార్‌లో రెండు నెలలుగా మూలుగుతున్నాయి. పంపిణీకి ఏర్పాట్లు చేసినా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టైమ్ ఇవ్వకపోవడంతో రెండు సార్లు వాయిదా పడింది. దాంతో స్కీమ్‌లో ఎంపికైన 15 మంది దివ్యాంగులు మంత్రి ఎప్పుడొస్తారో.. స్కూటీలు ఎప్పుడిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

కేసీఆర్ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ఎంతో కృషి చేసింది. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం దివ్యాంగ విద్యార్థులు, యువతకు మూడు చక్రాల స్కూటీలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 140 మంది దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారులను ఎంపిక చేసింది. వారి కోసం 15 స్కూటీలు మంజూరు చేసింది. కానీ.. శాసనసభ ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ఆగిపోయింది. ఎన్నికల కోడ్ ముగిశాక ఇస్తామని అధికారులు చెప్పుకొంటూ వస్తున్నారు. ఇప్పుడు మంత్రి వస్తేనే పంపిణీ అంటున్నారు. దీంతో లబ్ధిదారులు నిరాశకు గురవుతున్నారు.

ఒక్కొక్క వాహనం రూ.95 వేలు

జిల్లాకు 15 స్కూటీలు మంజూరు కాగా, వాటిని టీవీఎస్ కంపెనీ నుంచి ఒక్కొక్కటి రూ.95 వేలు పెట్టి కొనుగోలు చేశారు. మొత్తం రూ.14.15 లక్షలు పెట్టి కొనుగోలు చేసి దాదాపు మూడు నెలలు అయ్యింది. అయినా కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పంపిణీ చేయడానికి ముందుకు రావడం లేదు.

జిల్లా కేంద్రానికి మంత్రి వచ్చింది ఒక్కసారే..

జిల్లాకు చెందిన రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరువాత జిల్లా కేంద్రంలో పర్యటనలు చేయడం, ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించడం జరుగలేదు. కాంగ్రెస్ నాయకుడి విగ్రహ ఆవిష్కరణకు ఒక్కసారి మాత్రమే జిల్లా కేంద్రానికి వచ్చారు. కలెక్టరేట్ వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. జిల్లా యంత్రాంగం ఏం చేస్తుంది.. పాలన ఎలా సాగుతుందో పట్టించుకోలేదు. అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన దాఖలాలు లేవు.

పుట్టంగండి పంపుహౌస్

పుట్టంగండి పంప్‌హౌస్‌కు మరమ్మతులు

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 28 : ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులో కీలక భాగమైన పుట్టంగండి పంప్‌హౌస్‌లో కొద్ది రోజులుగా గ్రౌటింగ్ పనులు కొనసాగుతున్నాయి. పంప్‌హౌస్ పైపులైన్ భాగంలో కాంక్రీట్ గోడ నుంచి కొద్ది రోజులగా సీపేజ్ నీరు వస్తుంది. దాంతో దానికి అనుకుని ఉన్న ఇనుప పిల్లర్లు తుప్పు పట్టడంతో మరమ్మతుల కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.35 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో కొద్ది రోజులుగా గోడలకు గ్రౌటింగ్ చేపట్టి లీకేజీలను అరికడుతున్నారు. భవిష్యత్‌లో పంప్‌హౌస్‌కు ఎటువంటి ప్రమాదం ఉండకుండా గత ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టగా పనులు వేగవంతంగా నడుస్తున్నాయి.